పార్కు.. మురికి కూపం

బడంగ్‌పేట, ఆగస్టు 16: దీన్‌దయాల్ నగర్ కాలనీలో పార్కు స్థలం మురికి కూపంగా మారడంతో మురుగు కంపు కొడుతోంది. పార్కు మొత్తం మురికి కూపంగా మారిందంటే అతిశయోక్తి కాదనిపిస్తోంది. అయితే పక్కనే ప్రభుత్వ పాఠశాల ఉండటంతో విద్యార్థులు చదువుకోవడానికి ఆటకంగా మారింది. దీంతో పాటు స్థానికులు పార్కును ఆనుకొని ఉన్న రోడ్డు గుండా ప్రయాణిస్తుంటారు. ఆ రోడ్డు సైగం మురుగుతో నిండిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పార్కు చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేసినా ఫలితం లేకుండా పోయింది. పార్కు మొత్తం చెత్త డంపింగ్ కేంద్రంగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేగాకుండా దోమలు, ఈగలకు నిలయంగా మారడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని భయాందోళనకు గురవుతున్నారు. మరోవైపు నిత్యం ముక్కుపుటలు అదిరేలా దుర్గంధం వెదజల్లుతోంది. సంబంధిత అధికారులు పట్టించుకున్న సందర్భం లేదు. ఈ పార్కుకు ఓ పక్క మహేశ్వరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఉండగా.. మరోపక్క ప్రభుత్వ పాఠశాల ఉండటంతో సమస్య తీవ్రత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం పరిధిలో ఉన్న దీన్‌దాయల్ నగర్‌కాలనీలో మురుగు నీరు పరుగులు పెడుతున్నా పట్టించుకునే నాథుడు లేడని స్థానికులు విమర్శిస్తున్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మరో పక్క ప్రభుత్వ పాఠశాల మధ్య ఉన్న రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తున్న దృశ్యం

నెలల తరబడి మురుగు పరుగు

నెలల తరబడి మురుగు నీరు ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పారుతోంది. మురుగు పారడంతో రోడ్డు గుంతలమయంగా మారింది. అధికారులు నిత్యం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి వస్తుంటారు. కానీ మురుగు సమస్యను పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపిస్తున్నారు. నీరు ఇదిలా ఉంటే విద్యార్థులు మధ్యాహ్నాన భోజనం అక్కడే కూర్చొని భోంచేస్తారు. దుర్గంధం వాసనతో సగం కడుపు నింపుకుంటున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. సమస్యపై పాఠశాల ఉపాధ్యాయులు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే పరిస్థితి లేదు.

నిత్యం ఇదే రోడ్డున వెళ్తున్న మేయర్

మీర్‌పేట మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్ నిత్యం ఇదే రోడ్డు నుంచి ప్రయాణిస్తుంటారు. సమస్యను పట్టించుకోక పోవడం బాధాకరమని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మురుగు సమస్యను వెంటనే పరిష్కరించాలని స్థానికులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. లేదంటే ఆందోళన బాట పడతామని విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్చరిస్తున్నారు. పార్కును వినియోగంలోకి తీసుకొస్తే విద్యార్థులకు మేలు జరుగుతుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లెలగూడ దీన్‌దాయల్‌నగర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాల వెనుక భాగంలో మురుగు నీటితో దుర్గంధంగా మారిన పార్కు స్థలం

తుక్కుగూడ మున్సిపాలిటీలో ఉత్తమ సేవలు అందించిన కమిషనర్‌గా వెంకట్రామ్‌కు పంద్రాగస్టు సందర్భంగా ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ శశాంక. – బడంగ్‌పేట, ఆగస్టు 16

బహదూర్‌పుర మండల ప్లానింగ్ స్టాటిస్టికల్ అధికారిగా ఉత్తమ సేవలందించిన ఎ.వనితకు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి. – ఆర్కేపురం, ఆగస్టు 16

బదిలీపై వెళ్లిన సిబ్బందిని సన్మానించిన ఏసీపీ కాశిరెడ్డి

సమాజం గర్వించేలా పోలీసులు పనిచేయాలి

హయత్‌నగర్, ఆగస్టు 16: పోలీసు వ్యవస్థలో ఎక్కడ విధులు నిర్వహించినా సమాజం గర్వించేలా పనిచేయాలని వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి అన్నారు. శుక్రవారం హయత్‌నగర్‌లోని ఎస్‌వీ కన్వెన్షన్ హాల్‌లో ఇటీవల బదిలీపై వెళ్లిన 25 పోలీసు సిబ్బందికి హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ జి.రామకృష్ణ ఆధ్వర్యంలో వీడ్కోలు ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏసీపీ కాశిరెడ్డి హాజరై మాట్లాడుతూ.. ప్రతి పోలీసు ప్రజలకు జవాబుదారీగా ఉంటూ విధులు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి, మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ కీసర నాగరాజు, ఎస్ఐలు సురేశ్, చందర్‌సింగ్, నర్సింహ, లక్ష్మీనారాయణ, లింగారెడ్డి, వెంకట్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సలీంనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, సభ్యులు

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట, ఆగస్టు 16: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల తెలిపారు. శుక్రవారం సలీంనగర్ కాలనీలో పర్యటించి స్థానిక సమస్యలను సంక్షేమ సంఘ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కాలనీ పార్కును అభివృద్ధి చేయాలని, అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టాలని, డ్రైనేజీ, తాగునీటి లీకేజీలు అరికట్టేందుకు కొత్త లైన్లను నిర్మించాలని సలీంనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్.కృష్ణారెడ్డి, సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరలో అధికారులతో కలిసి పర్యటించి ప్రతిపాదనలు సిద్ధం చేయిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ మలక్‌పేట నియోజకవర్గ ఇన్‌చార్జి కనుకుల రవీందర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘ సభ్యులు చందు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్స్ కాలనీలో నాలా నిర్మాణం వివరాలు తెలుసుకుంటున్న జడ్సీ, కార్పొరేటర్

ఎస్ఎన్‌డీపీ నాలా పనులను పూర్తి చేయాలి

వనస్థలిపురం, ఆగస్టు 16: హస్తినాపురం డివిజన్‌లో ఎస్ఎన్‌డీపీ కింద నిర్మిస్తున్న నాలా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ తెలిపారు. శుక్రవారం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో కలిసి డివిజన్‌లో పర్యటించారు. టీచర్స్ కాలనీలో నిర్మాణంలో ఉన్న నాలాను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వరద వస్తే ముంపునకు గురయ్యే ప్రమాదముందన్నారు. వర్షాకాలం పూర్తయ్యేలోపే నాలా పనులను పూర్తి చేయాలని సూచించారు. కొన్ని చోట్ల భూమి సమస్య ఉందని దానిని పరిష్కరించాలని సూచించారు. నాలాపై సమీక్ష చేసి వెంటనే పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ అశోక్‌రెడ్డి, ఈఈ కార్తిక్, ఏఈ హేమ నాయక్, డీసీ జకియా సుల్తానా, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ గజానంద్, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ స్వర్గీయ సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి 8వ వర్ధంతి పురస్కరించుకుని శుక్రవారం సైదాబాద్‌లోని ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న శ్రీనివాస్ రెడ్డి సతిమణి, మాజీ కార్పొటర్ సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు. – సైదాబాద్, ఆగస్టు 16



ఆకులమైలారం గ్రామంలో రోడ్లు వెడల్పులో ఇండ్లు కోల్పోయిన 30 కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున 1.50 లక్షలను అందజేస్తున్న శంకరి తిరుపతయ్య, కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు. – కందుకూరు, ఆగస్టు 16

సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వంపై పోరాటం

ఆర్కేపురం/బడంగ్‌పేట/పహాడీషరీఫ్, ఆగస్టు 16: కాలనీల్లో గత ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జరిగిన అభివృద్ధి శూన్యమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి సరూర్‌నగర్ డివిజన్ ఎస్‌బీఐ కాలనీ ముంపునకు గురైందని తెలుసుకున్న ఎమ్మెల్యే శుక్రవారం ఎస్‌బీఐ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో సమావేశమై కాలనీ స్థితిగతుల్ని అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వం హయాంలో ఎస్ఎన్‌డీపీ నాలా పనులకు నిధులు ముంజూరు చేయడం జరిగిందని.. కానీ నేడున్న ప్రభుత్వం అట్టి నిధులను అడ్డుకొని కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. ప్రజా పాలన చేస్తున్నామని చెప్పుకొంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం కాలనీల్లోని సమస్యలను గాలికొదిలేసి పబ్బం గడుపుతున్నారని పేర్కొన్నారు. కాలనీల అభివృద్ధికి నిధులు కేటాయించకుండా డ్రామాలు చేస్తుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, కాలనీల అభివృద్ధే లక్ష్యంగా నిధులు కేటాయించడం జరిగిందన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వంపై పోరాటం చేసి నిధులు తెచ్చి అభివృద్ధి పరుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం యూత్‌వింగ్ మాజీ అధ్యక్షుడు లోకసాని కొండల్ రెడ్డి, నాయకులు రిషి, కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

కాలనీవాసులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

పేదలకు వరం

ముఖ్యమంత్రి సహాయనిధిని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచారు. శుక్రవారం జల్‌పల్లి మున్సిపాలిటీ, ఎన్టీఆర్‌నగర్‌తో పాటు పలు గ్రామాలకు చెందిన అభ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు జిల్లెలగూడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జల్‌పల్లి మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్లు యంజాల జనార్దన్‌తో పాటు హమీద్ షర్ఫుద్దీన్, జల్లపల్లి మున్సిలిటీ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ యంజాల అర్జున్, సైదుపటేల్, పోలేమోని నాగేశ్ ముదిరాజ్, హుస్సేన్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

మన్సూరాబాద్, ఆగస్టు 16: పద్మావతికాలనీ వద్ద ఆగిపోయిన యూజీడీ ట్రంక్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయించి కాలనీల్లో మురుగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోనున్నట్లు మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. హయత్‌నగర్ పరిధి పద్మావతికాలనీ వద్ద ఆగిపోయిన ట్రంక్‌లైన్ పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎస్ఆర్ కాలనీ నుంచి లక్ష్మీ భవానీకాలనీ మీదుగా బాలాజీనగర్‌నగర్ వరకు మొదలైన ట్రంక్‌లైన్ పనులు పద్మావతికాలనీ వద్ద ఆగిపోయాయని తెలిపారు. భూమికి సంబంధించిన వ్యక్తులతో మాట్లాడి సమస్యను పరిష్కరించడం జరిగిందని త్వరలో పనులను పూర్తి చేసి సుమారు పదిహేను కాలనీల యూజీడీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నవీన్‌రావు, పారంద సాయి, శ్యాంసుందర్‌రెడ్డి, కడారి యాదగిరి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు నుంచి విముక్తికి..

హయత్‌నగర్, ఆగస్టు 16: డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో వరద ముంపు సమస్య పరిష్కారానికి కృషిచేస్తున్నానని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం హయత్‌నగర్ డివిజన్‌లోని కమలానగర్‌లో మున్సిపల్ అధికారులతో కలిసి కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమలానగర్ రోడ్డు నం.2,7లో లోతట్టు ఉండటం వల్ల వర్షపు నీరు వచ్చి ముంపునకు గురై కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వరదనీటి కాలువలో వర్షపునీరు నిల్వకుండా చెత్తాచెదారాన్ని సిబ్బందితో తొలగించామని వెల్లడించారు. ఆయన వెంట డీఈ దామోదర్, ఏఈ చంద్రశేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేశ్, కాలనీ అధ్యక్షుడు టీవీ రావు, బండారి మల్లేశ్, మదన్‌రెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌లో తనిఖీలు

బడంగ్‌పేట, ఆగస్టు 16: పెట్రోల్ బంక్‌ల నిర్వహణ అధ్వానంగా ఉంటే చర్యలు తప్పవని ఫౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ హెచ్చరించారు. మహేశ్వరం మండలం నాగారంలోని పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ.. పెట్రోల్ బంక్‌లో డీలర్ లేదా మేనేజర్ తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని తెలిపారు.

వెంకటేశ్వర్లు గుప్తాకు ఉత్తమ సేవా పురస్కారం

కందుకూరు, ఆగస్టు 16: 25ఏండ్లుగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించిన రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కుచకూరి వెంకటేశ్వర్లు గుప్తాకు రంగారెడ్డి జిల్లా కెమిస్ట్రి, డ్రగ్గిస్ట్ జిల్లా అధ్యక్షుడు కృష్ణకుమార్, కోశాధికారి సత్యనారాయణ శుక్రవారం వెంకటేశ్వర్లు గుప్తాకు ఉత్తమ సేవా పురస్కారం అవార్డును అందజేశారు.

పౌరాణిక పద్యనాటక పోటీలు ప్రారంభం

వనస్థలిపురం, ఆగస్టు 16: రంగస్థల కళాకారుల అభిమాన సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పౌరాణిక పద్య నాటక పోటీలు గురువారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమి సౌజన్యంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా నవక్రాంతి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్త ప్రహ్లాద, ఖమ్మ కల్చరల్ అసోసియేషణ్ ఆధ్వర్యంలో బ్రహ్మర్షి విశ్వామత్రి పద్య నాటికలను ప్రదర్శించారు. నటీ నటులు తమ అభినయంతో ఎంతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో వీవీ సుబ్బారావు, జడ్జి కృష్ణమూర్తి, పీవీవీ సత్యనారాయణ, వర్ధిని, పంపన వెంకటేశ్వరరావు, రావిపూడి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మర్షి విశ్వామిత్ర పౌరాణిక పద్యనాటకంలో ఓ సన్నివేశం

అమ్మవారికి మకరతోరణం

శామీర్‌పేట కట్ట మైసమ్మ దేవాలయంలో అమ్మవారికి ఐదు కిలోల వెండితో తయారు చేయించిన మకరతోరణాన్ని అందజేసిన గడ్డి అన్నారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ గండి కృష్ణ యాదవ్ దంపతులు, వారి కుమారుడు బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు గండి సన్నీ యాదవ్. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. - ఎల్బీనగర్, ఆగస్టు 16

శ్రావణ శుక్రవారం.. ప్రత్యేక పూజలు

శ్రీసాయినగర్ కాలనీలోని శ్రీదుర్గాదేవి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేశ్‌యాదవ్

సైదాబాద్ పూసలబస్తీలో వరలక్ష్మి వ్రతం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మహిళలు

మన్సూరాబాద్, ఆగస్టు 16: శ్రావణ శుక్రవారంను పురస్కరించుకొని నాగోల్ డివిజన్ పరిధి శ్రీసాయినగర్‌కాలనీలోని శ్రీదుర్గాదేవి దేవాలయంలో శుక్రవారం ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా శ్రీదుర్గాదేవి అమ్మవారిని 324 చీరలతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు యాదగిరి, హన్మంతరావు, రవి, మురళి, రమణమూర్తి, కృష్ణమూర్తి, రమేశ్, అజయ్, అశోక్, సత్తిరెడ్డి, అర్చకులు బాలమురళీ శర్మ తదితరులు పాల్గొన్నారు.



ఆర్కేపురం డివిజన్ వాసవి కాలనీలోని అష్టలక్ష్మీ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు – ఆర్కేపురం

పోచమ్మ దేవాలయంలో..

మన్సూరాబాద్ డివిజన్ పరిధి సీఆర్ ఎన్ క్లేవ్‌లోని పోచమ్మ దేవాలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్‌చైర్మన్లు గణేశ్‌యాదవ్, నాంపల్లి శంకరయ్య, ప్రధాన కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి, సభ్యులు నాంపల్లి కృష్ణ, అర్చకులు శ్రీధరాచార్యులు పాల్గొన్నారు.

మలక్‌పేట నియోజకవర్గంలో..

సైదాబాద్, ఆగస్టు 16: శ్రావణ మాసం రెండో శుక్రవారం పురస్కరించుకొని మలక్‌పేట నియోజకవర్గంలోని పలు అమ్మవారి ఆలయాల్లో వరలక్ష్మి వ్రతాలు ఘనంగా జరిగాయి. మలక్‌పేటలోని హరిహర మైసమ్మ క్షేత్రం, లక్ష్మీనగర్ కాలనీ వెంకటేశ్వర భక్తస మాజం, సైదాబాద్ జీవన్‌జ్యోతి సంఘం జయదుర్గా ఆలయం, మాతా మైదాన్ విజయదుర్గాదేవి ఆలయం, భూలక్ష్మిమాత ఆలయం, పెద్ద తోట దుర్గామాత ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలకరించి ప్రతేక పూజలు, వ్రతాలు చేశారు. సైదాబాద్ పూసల బస్తీలోని నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్‌జీ సతిమణి ఆధ్వర్యంలో వరలక్ష్మి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు.

శ్రీసాయినగర్ కాలనీలోని శ్రీదుర్గాదేవి దేవాలయంలో అమ్మవారికి 324 చీరలతో అలంకరించి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పీజీ కోర్సుల వన్‌టైం చాన్స్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 16: ఓయూ పరిధిలోని వివిధ పీజీ కోర్సులు పూర్తి చేసి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు మిగిలి, కాలపరిమితి పూర్తైన వారికి కల్పించిన వన్‌టైమ్ చాన్స్ పరీక్ష ఫీజు స్వీకరణ గడువు పొడగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంకామ్ (ఐఎస్), ఎంలిబ్ ఐఎస్సీ, బీలిబ్ఐఎస్సీ, ఎంసీజే, బీసీజే కోర్సుల్లో 2000 ఏడాది తరువాత చేరినవారు సైతం తమ బ్యాక్‌లాగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు అవకాశమిచ్చామన్నారు. కోర్సుల అన్ని సెమిస్టర్ల పరీక్ష ఫీజును వచ్చే నెల 28లోగా చెల్లించాలని సూచించారు. రూ.500 అపరాధ రుసుముతో వచ్చే నెల 4గా చెల్లించవచ్చని చెప్పారు. అన్ని కోర్సుల పరీక్షలకు సాధారణ పరీక్ష ఫీజుతో పాటు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సిలబస్, పరీక్ష విధానంలోనే వారు పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పరీక్షలు అక్టోబర్, నవంబర్ నెలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఎమ్మెస్సీ డేటా సైన్స్ పరీక్ష తేదీల ఖరారు

ఓయూ పరిధిలోని ఎమ్మెస్సీ డేటా సైన్స్ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఈ కోర్సు రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 4 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం కృషి

కందుకూరు, ఆగస్టు 17: రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఫార్మా ఇండస్ట్రీస్‌కు భూములు ఇచ్చిన రైతులకు ఓకే చోట అభివృద్ధి చేసి ఇండ్ల స్థలాలు ఇస్తామని పేర్కొన్నారు. మండల పరిధిలోని బేగరి కంచెతో పాటు పలు గ్రామాల్లో పర్యటించిన అనంతరం మాట్లాడుతూ.. స్కిల్ సిటీగా.. నాలుగో నగరం ఏర్పాటు చేసి ప్రపంచ స్థాయిలో పేదలకు నాణ్యమైన విద్యను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, గంగుల ప్రభాకర్‌రెడ్డి, శ్రీదర్ ముదిరాజ్, అఫ్జల్ బేగ్, భూపాల్‌రెడ్డి, కృష్ణా నాయక్, రాంరెడ్డి పాల్గొన్నారు.